## ఉపసర్పంచ్‌పై దాడి.. కఠిన చర్యలు తీసుకోవాలి

**రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్**




**మన తొలివెలుగు ఇబ్రహీంపట్నం ప్రతినిధి సీ.హెచ్ రాజు (08ఆగస్ట్2026) :** యాచారం మండల పరిధిలోని ధర్మన్నగూడ ఉపసర్పంచ్ గౌర నాగరాజుపై జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం యాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాగరాజును అభివృద్ధి పనులను అడ్డుకోవడంతో పాటు చేన్నయ్య, శ్రీనివాస్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు భౌతికంగా దాడి చేశారని తెలిపారు. ప్రజా ప్రతినిధులపై వరుసగా దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నెల రోజుల క్రితం తక్కళ్లపల్లి తండా ఉపసర్పంచ్‌పై కూడా దాడి జరిగిందని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. నాగరాజుపై దాడికి పాల్పడిన వారిపై కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరగకపోతే డీసీపీ, డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని కార్తీక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, గౌరవ అధ్యక్షులు శివ గౌడ్, ఉపాధ్యక్షులు రోహిత్, మచ్చ అనిల్ కుమార్, రాజు, మధుకర్ రెడ్డి వివిధ మండలాల ఫోరం అధ్యక్షులు, ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.


## ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడమే బీజేపీ దేశభక్తా..?

**సీఐటీయూ**



**మన తొలివెలుగు ఆలంపూర్ ప్రతినిధి డేవిడ్ (08 ఆగస్ట్ 2026) :** దశాబ్దాల పోరాటాల ఫలితంగా కార్మిక వర్గం సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడమే బీజేపీ చెబుతున్న దేశభక్తా..? అని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం రాజోలి మండల కేంద్రంలో నిర్వహించిన సిఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమని అన్నారు. కార్మిక చట్టాల సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతున్నదని విమర్శించారు. రోజులో 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు నిద్ర అనే జీవన విధానాన్ని కార్మిక వర్గం కోసం సాధించేందుకు పోరాడగా, ఇప్పుడు పని గంటలను 12కు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. యూనియన్ రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. సులభతర వాణిజ్యం పేరుతో విదేశీ పెట్టుబడులకు ఎర్ర తివాచీ పరుస్తూ స్వదేశీ కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. కార్మికులు కనీస వేతనం, పని గంటలు, హక్కుల గురించి ప్రశ్నిస్తే కులాలు, మతాలు, ధర్మం పేరుతో విద్వేష రాజకీయాలు సృష్టిస్తూ కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారని అన్నారు. దేశం ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని చెప్పుకునే పాలకులు, కార్మికుల జీవన ప్రమాణాలు ఎందుకు దిగజారుతున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారుల వద్ద లక్షల కోట్ల సంపద ఉండగా, కార్మిక వర్గం కనీస అవసరాల కోసం అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో వడ్డేపల్లి మండల కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ డి. లక్ష్మన్న, ఆశ కార్యకర్తలు సుజాత, రేణుక, పద్మ, లక్ష్మి, కార్మికులు సౌల్ రాజ్, కృష్ణ, రవాణా రంగ కార్మికులు జయన్న తదితరులు పాల్గొన్నారు.

## కట్టమ్మ మైసమ్మ వద్ద బోనాల ఏర్పాట్లు



**మన తొలివెలుగు మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (08 ఆగస్ట్ 2026) :** జల్ పల్లి సర్కిల్ పరిధిలోని జల్ పల్లి పెద్ద చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయం వద్ద బోనాల ఏర్పాట్ల పనులను బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకత ఐన బోనాల పండుగను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆలయం వద్ద మట్టిని పోసి చదును చేయించడం జరిగిందన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఆదివారం సబితా ఇంద్రారెడ్డి కాలనీవాసులు అమ్మవారికి బోనం తీసి నైవేద్యం సమర్పించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మోయిన్ బాబా, సూపర్వైజర్ బుడుమాల కుమార్, జల్ పల్లి వాసి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాబిన్‌హుడ్ ప్రజా వీరుడు పండుగ సాయన్న



**మన తొలివెలుగు మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (08 ఆగస్ట్ 2026) :**తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్న అని ప్రజా వీరుడుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాడని ముదిరాజ్ నేతలు తెలిపారు. ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించిన మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మహాసభ అధ్యక్షుడు పులకరం శివశంకర్ ముదిరాజ్, ముదిరాజ్ నేతలు పృథ్వీరాజ్ ముదిరాజ్, బొమ్మరగోని యాదగిరి ముదిరాజ్, వనం నరసింహా ముదిరాజ్, తులసి ముకేశ్ ముదిరాజ్, బొమ్మ కంటి దయానంద్ ముదిరాజ్ , నారబోయిన అంజయ్య ముదిరాజ్, గంట రామకృష్ణ ముదిరాజ్, మేకల కృష్ణ ముదిరాజ్ , శివ ముదిరాజ్, సాయం వెంకటేష్ ముదిరాజ్, అభిలాశ్ ముదిరాజ్ , వనం వినయ్, వనం సాయి ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ సాయన్న 1840 నుంచి 1900 మధ్య కాలానికి చెందినవాడన్నారు. అతని తల్లి సాయమ్మ, తండ్రి అనంతయ్య. సాయన్న తెలంగాణలోని మహబూబ్ నగర్ దగ్గర నవాబ్ పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామానికి చెందినవారని తెలిపారు. అతను గ్రామీణ క్రీడల్లో ఆరితేరినవాడు. 20 కేజీల గుండును అవలీలగా ఒక్కచేత్తో లేపేవాడన్నారు. ప్రజలకు సహాయం చేసే వ్యక్తిగా గుర్తింపు పొందినప్పటికీ ఆధిపత్య వర్గాల వాళ్లు బందిపోటుగా చిత్రించారన్నారు. అతను ప్రజల కోసం నిలబడి ఆధిపత్య వర్గాలపై యుద్ధం చేశారన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో దానధర్మాలు చేస్తూ ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పండుగల సాయన్న సుపరిచితుడయ్యారని అన్నారు. ప్రజలను దోచుకుంటున్న దొరలు, దేశ్‌ముఖ్‌లు, అధికారులు, సంపన్నుల ఆస్తులను తీసుకుని పేదలకు పంచిపెట్టారని పేర్కొన్నారు. పండుగ సాయన్న. పండుగ సాయన్న 18వ శతాబ్ధం చివరలో జీవించిన ప్రజావీరుడు. 35---38 ఏళ్ల వయసులో చంపబడ్డారన్నారు. తెలంగాణ రాబిన్ హుడ్, ప్రజా వీరుడుగా సుపరిచితుడు. ప్రజలను హింసలకు గురిచేస్తూ, నిరంతరం దోచుకుంటూ, ప్రజల మాన ప్రాణాలను హరిస్తున్న దొరల, దేశముఖి, అధికారుల, సంపన్నుల ఆట కట్టించాడన్నారు. ధనవంతుల నుంచి తీసుకుని పేదలకు పెట్టిన పండుగల సాయన్న ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. ఆనాటి నిరంకుశ నిజాం పాలనను, అధికారులను ప్రశ్నించి ఎదిరించిన పండుగల సాయన్న.. తన సొంత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయితే ఆధిపత్య శక్తులైన దేశ్‌ముఖ్‌లు, కరణాలు, పటేళ్లు, భూస్వాములు పథకం వేసి నిజాం ప్రభుత్వంతో సాయన్నను హత్య చేయించారని గుర్తు చేశారు. పండుగ సాయన్న ఆదర్శంగా తీసుకొని ముదిరాజ్ లు సేవ గుణంతో , సత్ ప్రవర్తనతో ఆయన ఆశయాలు సాధించడానికి ముందుకు వెళ్లాలన్నారు.

## లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ అమ్మవారికి బంగారు బోనం

**అమ్మవారికి ఇక్కత్ పట్టుచీర సమర్పించిన ఏ. పావని వినయ్ కుమార్ దంపతులు**



**మన తొలివెలుగు తెలంగాణ బ్యూరో ప్రతినిధి సాయి కిషోర్ కనుగుల (08 ఆగస్ట్ 2026) :** పాతబస్తీలోని ప్రసిద్ధి చెందిన లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ అమ్మవారికి ఆషాడ బోనాల సందర్భంగా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఏ. పావని వినయ్ కుమార్ బంగారు బోనంతో పాటు ప్రత్యేక చేనేత ఇక్కత్ పట్టుచీరను కుటుంబ సభ్యులతో కలిసి సమర్పించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏనుగుల అనిల్ కుమార్ కుటుంబ సభ్యుల స్వహస్తాలతో నేసిన ఇక్కత్ పట్టుచీరను అమ్మవారికి అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించి భక్తి శ్రద్ధలతో బంగారు బోనం సమర్పించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. మేకలబండ నుంచి డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, వేషధారణలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి , బిగ్ బాస్ ఫేమ్ భానుపాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గౌలిపుర మాజీ కార్పొరేటర్లు ఆలె భాగ్యలక్ష్మి, ఆలె జితేందర్ తదితరులు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుండగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. లాల్ దర్వాజా బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని పావని వినయ్ కుమార్ కోరారు.

## సరూర్‌నగర్ ఎస్సై మారయ్య గౌడ్‌కు ఘనంగా సన్మానం

**సన్మానించిన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి**





**మన తొలివెలుగు సిటీబ్యూరో :**సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో గత రెండు సంవత్సరాలుగా సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న మారయ్య గౌడ్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో కూడా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందించిన సేవలు, పోలీస్ శాఖలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న మారయ్య గౌడ్ కి భవిష్యత్తులో మరిన్ని విజయాలు, ఉన్నత పదవులు లభించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోహిత్, రవి కుమార్ రెడ్డి, గోవర్ధన్,విజయ్, శివ పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి పనుల్లో వేగం పెంచాలి

**మోత్కూర్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సామెల్**



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ (08ఆగస్ట్ 2026) :**యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం మోత్కూర్ పట్టణంలో పర్యటించిన ఆయన, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంతం నుండి రాజన్నగూడెం వరకు జిల్లా కేంద్రానికి వెళ్లే ముఖ్యమైన రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఈ కీలకమైన రహదారి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ముఖ్యంగా రాజన్నగూడెం సమీపంలో రోడ్డు అత్యంత అధ్వానంగా తయారవ్వడంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక నివాసితులు ప్రతిరోజూ తీవ్ర నరకయాతన అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను మధ్యలోనే అసంపూర్తిగా వదిలేయడం వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ప్రజలు పడుతున్న రవాణా ఇబ్బందులను గుర్తించి, పనులను త్వరగా పట్టాలెక్కించేందుకు తాను ప్రత్యేకంగా చొరవ తీసుకున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో పాటు కొత్త కాంట్రాక్టర్‌తో పదేపదే చర్చలు జరిపి, సాంకేతిక సమస్యలను పరిష్కరించి పనులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు, వాహనదారులకు త్వరలోనే గుంతల రహిత రహదారి అందుబాటులోకి వస్తుందని, పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## దేదీప్య హై స్కూల్లో ఘనంగా బోనాలు






**మనతొలి వెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ (08 ఆగస్ట్ 2026):** భువనగిరి లోని ఆర్. బీ నగర్ దేదీప్య హై స్కూల్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా పాఠశాలలో ఆషాడ మాస బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు అలంకరించుకొని బోనాల పండుగకు సంబంధించిన సాంస్కృత కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యార్థినీలు సాంప్రదాయ దుస్తులు ధరించి నుదుట కుంకుమ ధరించి విద్యార్థులు నెత్తిన బోనాలు ఎత్తగా చేతిలో వేపకొమ్మలు పట్టుకొని డప్పు చప్పులో పోతరాజుల విన్యాసాలతో హై స్కూల్ ప్రాంగణాలు అలరించిపోయాయి. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు తమపై ఉండాలని హైస్కూల్ ప్రిన్సిపల్ తుంగతుర్తి శేషగిరిరావు కోరుకున్నారు. డైరెక్టర్ రంగారావు, వీర నాగేందర్, శంకర్, తుంగతుర్తి సంతోష్, రూప, రమ్య పాల్గొన్నారు.

## ఆగస్టు 10 న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యండి

**పైళ్ల యాదిరెడ్డి**

**రైతు సంఘం జిల్లా నాయకులు**



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ (08ఆగస్ట్ 2026) :**ఆగస్టు 10 న నిర్వహించ తలపెట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, కార్మిక, రైతు వ్యవసాయ కార్మికుల హక్కులపై తీవ్రదాడిచేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ లాభల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, లేబర్ కోడ్లు తీసుకోచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తూ గ్రామీణ పేదల జీవనోపాదిని దెబ్బతీస్తున్న బీజేపీ విధానాలను దేశ ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు ప్రభుత్వం కొనుగోలు గ్యారెంటి కల్పించాలని, వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టడం అంటే వ్యవసాయ రంగాన్ని నీరుకార్చడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రుణాలు, ఎరువులు విత్తనాలు వంటి సమస్యలపై రైతులు ఆందోళనలో ఉన్నారని, భారత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే జైల్ భరో కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా కార్మికులు, రైతులు ప్రజలు అధిక సంఖ్యలో కదలి రావాలని పిలుపునిచ్చారు.

